# చిరుదీపం

డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి



## పేషెంట్ చెప్పే కథలు

వర్షపు ధారల్లో చీకటి కాటుకలా కరుగుతూంది. మేఘ గర్జనలకు ప్రకృతి ఉలికులికి పడుతూంది. అప్పుడప్పుడు విద్యుల్లతలు తళుక్కుమంటున్నాయి.

గదిలోని నిశ్శబ్దాన్ని చీలుస్తూ బజర్ మోగింది. ఫోన్ తీసి నర్స్ చెప్పింది విని గబగబ కిందకు దిగింది శ్రుతి. రిక్షాలోంచి ఒకామెను చేతులమీద మోసుకొస్తున్నారు. ఆమెతోపాటు వెల్లుల్లి, పసుపు కలగలిసిన వాసన గుప్పున వచ్చింది. దూరంనుంచి చూస్తే అసలు ప్రాణముందా అని అనుమాన మొచ్చేలా వేలాడిపోతూంది. అరికాళ్ళు, చేతుల్నిండా పసుపు, ఆమె అత్తగారు గుండెలు బాదుకుంటూ శోకాలు పెడుతూంది.

శ్రుతి పరీక్ష చేస్తూండగానే అకస్మాత్తుగా కనురెప్పల్ని ఆల్లల్లాడిస్తూ, గుప్పెళ్లు బిగించసాగిందామె. వుండుండి చిత్రమైన శబ్దాలు చేస్తూంది. పూర్తి పరీక్ష చేశాక ఆమె జబ్బేమిటో గుర్తించింది శ్రుతి.

మరునాడంతా కూడా ఆమె గుప్పెళ్ళు బిగిస్తూ, కాళ్ళూ చేతులూ కొట్టుకుంటూ, ఏడుస్తూ, కొంచెంసేపు ఏ అవయవాన్నీ కదిలించకుండా నిశ్చలంగా పడుకుంటూ, చూసేవాళ్ళకు మతిపోయేలా చేస్తూవుంది. మరీ ఎక్కువగా వున్నప్పుడు ఇంజక్షన్ చేస్తే కొంచెంసేపు నిద్రపోయి, మెలకువ రాగానే మళ్ళీ మొదలు.

నాలుగురోజులకుగాని కొంచెం కుదుట పడలేదు అంజని. శ్రుతి పని పూర్తిచేసుకుని ఆమె దగ్గరకువచ్చింది. శ్రుతిని చూసి సంకోచంతో తల దించుకుంది అంజని. కుశలప్రశ్నలయాక, ఎలా మొదలుపెడితే ఆమె నొచ్చుకోకుండా తన సమస్యను చెప్తుందా అని ఆలోచిస్తూ వుండిపోయింది శ్రుతి.

"కొద్దిపాటి బలహీనత తప్ప శరీరంలో జబ్బేమీలేదు మీకు. కేవలం మానసికమైన ఒత్తిడులు, ఆందోళనవల్ల యిలా వచ్చింది." మౌనంగా వింటూంది అంజని.

"మొదట్లోనే మీరు కంట్రోల్ చేసుకోవటానికి ప్రయత్నించకపోతే కష్టం. మించిపోయాక ఆ అస్తవ్యస్త స్థితిలో హాస్పిటల్స్ చుట్టూ తిరగడం ఎంత బాధ! మీరు బాగా లేకపోతే మీ భర్త, పిల్లలు ఎంత క్రుంగిపోతారు? అసలు మిమ్మల్నింతగా బాధిస్తున్న సమస్యేమిటి?" కళ్ళమీద అరచేతి నాన్చుకుని ఆలోచిస్తూంది అంజని.

"సమస్య"- అవును సమస్యే. తన బతుకే ఒక సమస్య అయిపోయింది. తను బాగా లేకపోతే తన భర్త కుంగిపోతాడా? తన ఆరోగ్యం చెడిపోతే అతను బాధపడతాడా?! లేదు లేదు. తను బాగాలేకపోయినా చివరికి చచ్చిపోయినా అతనికేం పట్టదు." దుఃఖం ముంచుకొస్తూంది అంజనికి.

నవ వధువుగా తను అతని జీవితంలో అడుగు మోపిన క్షణం, తమ కాపురంలోని తొలిరోజుల పన్నీటి జల్లులు, మధుర మధురంగా గడిచిన తమ దాంపత్యపు స్మృతులు చుట్టుముట్టి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఆ కమ్మటి కాలం కలలా కరిగిపోయింది. అతను, పిల్లలు - యిదే లోకంగా బతుకుతున్న తను క్రమేపీ అతను తన నుంచి దూరంగా జరగడం గుర్తించలేదు. తను గుర్తించే సమయానికి అతను తను అందుకోలేనంత దూరానికి వెళ్ళిపోయాడు. "ఏమయింది? ఎందుకిలా అయింది? యిందులో తన లోపెంత? ఎలా దీన్ని చక్కదిద్దుకోవడం?" అని తర్కించుకుని, శారీరకంగానూ, మానసికంగానూ తనలో పెద్ద మార్పేమీ కనపడక, తన పొరపాటేమిటో అర్థంకాక, ముసుగులో గుద్దులాటెందుకని అతన్నే ముఖాముఖి అడిగింది.

"మిమ్మల్నిలా నిలదీయడానికి నాకు సిగ్గుగా వుంది. అసహ్యంగా వుంది. ఎందుకిలా చేస్తున్నారు మీరు? నేను మీకేం తక్కువ చేశానని మరో ఆడదానికి దగ్గరయారు?" రోషంగా అడిగింది.

అతనుచెప్పిన జవాబువిని తనగుండెల్లో జ్వాలలు ఉవ్వెత్తున లేచాయి. తనఅందం, ఆకర్షణ, తన చదువు ఏపాటివో యిప్పుడా అతను ఆలోచించేది? ముగ్గురుపిల్లల తండ్రి తనపిల్లల తల్లిలో చూడవలసినవి చదువు, అందం, ఆకర్షణానా? అవి తనలో లేవని వాటికోసం బయటకు పరుగెత్తాలని యిప్పుడు జ్ఞానోదయమయిందా అతనికి? తమ మధ్య మానసిక బంధం పూర్తిగా తెగిపోయిందని గ్రహింపుకొచ్చేసరికి దుఃఖసముద్రం కట్టలు తెంచుకుంది. అతను చేసిన అవమానానికి ఆవేశం ఎగసి వచ్చింది. అతని మాటలకు ఉద్రేకం ముంచుకొచ్చింది. తన ఒంట్లోని నరాలన్నిటినీ ఎవరో బలవంతాన సాగదీస్తున్నారు. తన మెదడులోని కణాలన్నీ చిట్లిపోతున్నాయి. రక్తనాళాలన్నీ తెగి పడిపోతున్నాయి. కళ్ళు చీకట్లు కమ్ముతున్నాయి. అంతా గుర్తుకొచ్చి అంజని ముఖం ఎర్రబడింది.

ఆలోచనలు. ఆలోచనలు. నిగ్రహించుకోలేని ఆలోచనల సమూహం తనకు ఊపిరాడనివ్వడంలేదు. కాని, యిదంతా డాక్టర్‌గారికి తను చెప్పలేదు. యింత అవమానకరమైన సమస్యను ఆవిడకు చెప్పాలంటే తనకు చిన్నతనంగా వుంది. "నా సమస్య ఎవరితోనూ చెప్పుకోలేనిది డాక్టర్‌గారూ! కాని, నేను ధైర్యంగా వుండడానికి ప్రయత్నిస్తాను" కళ్ళల్లోని తడి శ్రుతి చూడకుండా జాగ్రత్తపడిందిఅంజని.

"దట్స్‌గుడ్." సంతోషాన్ని వ్యక్తం చేసింది శ్రుతి.

"నన్ను నేను కంట్రోల్ చేసుకోలేకపోవడం వల్ల యీ నాలుగు రోజులూ మీకు చాలా శ్రమ కలిగింది. నేను పిచ్చిదాన్నవడం వల్ల నా సమస్య తీరదని నాకు తెలుసు. తెలిసి కూడా నిగ్రహించుకోలేకపోతున్నాను. కాని.... మన ఆడవాళ్ళస్థితి ఎప్పటికీ యింత దరిద్రంగానే వుండిపోతుందని నేననుకోవడంలేదు." సమస్యల సుడిగుండంలో చిక్కుకుని నిస్సహాయంగా అట్టడుగుకు జారిపోయేవారేకాని తమంతతాము నిలద్రొక్కుకుని, నిలబడడానికి ప్రయత్నించే స్త్రీలను అరుదుగా చూడడంవల్ల అంజని మాటలు సంతోషాన్నీ, ఆశనూ, గర్వాన్నీ కలిగించాయి శ్రుతికి.